# "అయ్యోరామా!"

యవ్వనం వస్తూన్నప్పుడు పూలరథం మీద పువ్వుల విలుకాడు నిల్చుని టివ్వుటివ్వుమని పూలబాణాలను ప్రేయసీ ప్రియులు అయినా కాకపోయినా ఆడపిల్లల మీంచి మగపిల్లలకేసి, మగపిల్లల మీంచి ఆడ అమ్మాయిలకేసి కొట్టి 'తమాషా' చూసి ఆనందిస్తూ వుంటాట్ట! మీసాలొస్తున్నపుడు యీ భూప్రపంచకంలో మనొక్కరికే వస్తూన్నట్లు ఓ ఫీలింగు నిక్కర్ల లోంచి పేంట్లలో కొచ్చిన కుర్రాడికి కలుగుతుంది. ఆపైన ఆ మీసాల్ని వయ్యారి మిఠారీల మీద దువ్వడమా, సొసైటీ మీద దువ్వడమా అన్నది ఆ కుర్రాడాలోచించు కుంటాడు. యవ్వనం రావడం మగపిల్లల మీద గొంతుక బొంగురు పోవడంతో సెట్టవుతుంది. తల్లులూ చెల్లెళ్ళూ అక్కలూ - కీచుగొంతుకతో ఆడపిల్లలా మాట్లాడే చిట్టితమ్ముడు వున్నట్లుండి రావుగోపాల్రావు గొంతుక ఫాలో అవగానే యీ వెధవ పురుషజాతికి చెందిన వాడని, కాస్త జేగర్తగా కనిపెట్టాలని ఫిమేల్సు అంతరాంతరాల్లో వినపడని వార్నింగులిచ్చుకుంటారు. అంతదాకా అక్కలు వదినలు చెల్లెళ్ళు పిన్నులు అత్తల పక్కల్లో నిద్రపోనిచ్చే వాళ్ళల్లా - యీ చిట్టి గాడ్ని దూరంగా పడుకోబెట్టండి అని అసింటా నెట్టేసి - వాడి ముందు జాకెట్లు వేసుకోవడం, పరికిణీలు మార్చుకోడం, పమిట్లు సర్దుకోడం, బాడీలు వేసుకోడం యిత్యాది భామాకలాపాలు మానేస్తారు. వాళ్లమాటల్లోకి కూడా రానివ్వకుండా తరిమేస్తారు. నాన్నలు, బాబయ్యలు, మామయ్యలూ కూడా 'ఆడాళ్ళతో నీకేవిటిరా? యివతలకురా' - 'ఆడాళ్ళలో పెద బావగారిలా వెళ్ళకు'మని కూకలేస్తారు. చిన్నప్పుడు మనతో కలిసీ మెలసీ వున్న ఆడపిల్లలు సైతం సడెన్‌గా పలకరించడం మానేసి చూసినపుడు తేలు కుట్టినట్లు లేచి హడావిడిగా వడివడిగా తడబడే నడక్సుతో చెల్లాచెదురవుతారు. ఇదంతా మన కొంపల్లో జవ్వన విలాసమే.

కొంచెం గడ్డమ్మి మీసమ్మ వస్తూన్న కజిన్ని టైలర్ దగ్గరకు పంపించడానికో, కాఫీ హోటలుకెళ్ళి పెసరట్లు పొట్లం కట్టించుకు రావడానికో, క్యూలో నిలబడి బస్సుటికెట్లు, సినిమా టిక్కెట్లూ, రైల్వే రిజర్వేషన్లూ తేవడానికో నియోగిస్తారు. కొందరాడాళ్లు మీసమ్మా గెడ్డమ్మా వస్తూన్న కుర్రాళ్ళని కూడా కేర్ చెయ్యకుండా తలుపులేసుకోకుండా మంచాలెక్కుతారు. వారి ఆస్తిపాస్తుల గురించి వారికే ఏమీ అవగాహన వుండనట్లు బిహేవ్ చేస్తారు. వళ్ళుదగ్గరెట్టుకోకుండా కేర్‌లెస్‌గా పవిట్లు ఝాడిస్తూ, జుట్టు ఎగసన దోసుకుంటూ, బుగ్గలు రుద్దుకుంటూ, చెంపలు సవరించుకుంటూ నవయవ్వనవిలాసాన్ని ప్రదర్శిస్తూ చివ చివలాడే వయసులో వున్న కుర్రకార్పుని కిర్రెక్కించి చిర్రెత్తిపోయేలా చేస్తూవుంటారు.

గారడీ వాడి బుట్టలోంచి మావిడిచెట్టు కాయగాసి పండయినట్టు తమతో ఆడుకున్న ఆడపిల్లలు మారి జాంపళ్ళలా, పనసతొనల్లా, చెరుకురసాల్లా కనిపిస్తారు చూసేవాళ్ళకు. 'ఒస్సి- చీవిడిముక్కూ యిదీనూ-యింతుండేది- అప్పుడే ఎంతలా ఎదిగిందీ' అని పెద్దాళ్లు బుగ్గలు

నొక్కుకొనేలా మనిషిని మార్చగలశక్తి దేనికి వుంది? యవ్వనం అంటే ఏవిటి? మార్పు అంటే ఏవిటి? వాట్ యీజ్ వాట్?

అంతా టైమ్-టైమ్-టైమ్!

అట్టు మాడిపోయిందంటే ఎవరు కారణం? విధి-విధి అంటే టైమ్ కదా! చీర చిరిగి పోయింది అంటే టైమ్ కాదా కారణం? బిందెకు చిల్లు పడింది అంటే బిందె కాలం చెల్లిచిల్లు పడిందనే కదా తాత్పర్యం! ఫిలాసఫీ అంటే ఏవిటి? కాలాన్ని ఎవరెవరు ఎట్లా మల్చుకుని ఏపనిని ఎందుకు చేశారో చెప్పడాన్ని చరిత్ర అంటారు. మా పక్కింటమ్మాయి హిస్టరీ అట్టే మంచిది కాదు అంటే ఏవిటంట మీనింగు? కాలం ఆ అమ్మాయి పట్ల మరోరకం గా వుందనే కదా రీజనింగ్. కొత్త పాత అనేవి కూడా కాలమహత్యాన్నే చెప్తాయి కదా! పెద్దాళ్ళు పోతే అంటే టపాకట్టేస్తే కాలధర్మం చెందారంటారు. ఎవరేనా చిన్నాళ్ళు పోతే కాలం ఘోరం చేసిందంటారు. టైమ్ హీల్స్ ఆల్ వూండ్సు అంటారింగ్లీషులో. కాలం అన్ని కురుపులను మాన్పును అని కాదు దాని తాత్పర్యం. అర్జునుడూ కర్ణుడూ, ధుర్యోధనుడూ భీముడూ, ఇందిరాగాంధీ - భుట్టో అంతా కాల గర్భంలో అన్నీ మరచి ఒకరి పక్కనొకరు నిద్రపోతూ వుంటారట. ఇలా ఆలోచిస్తూంటే అంతా వండర్‌ఫుల్‌గా వుంటుంది. అందుకే ఆలోచనామృతం అన్నారు. 'చేసిన సంపారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన' అని యీ ప్రపంచకాన్ని గురించి 'విశ్వనాథ' అన్నారు. సంసారంచేయడం అంటే - అది తిన్నగా సంసారం చేయదు అంటారు - ఆ అర్థమా? సంసారసాగరం అంటారు అదా? అదీ భవ సాగరం రెండూ ఒకటేనా? మొగుడూ పెళ్ళాలు చిలకాగోరింకల్లా చేసేదాన్ని సంసారం అనాలా కాపురం అనాలా? అబ్బా అన్నీ తీరీతీరని దవుట్సు - సత్యభామ కృష్ణుడ్ని తన్నిందండీ ఎడం కాలితో - అయితే తన్నింది కాలమా సత్యభామా? ద్రౌపదికి వస్త్రాపహరణం జరిగింది. కాలమే కదా కారణం లేక దుర్మదాంధుడు దుర్యోధనుడా? యముడ్ని కాలుడు కాలపురుషు డన్నారు. వాడి దగ్గరకు కాలం చెల్లిన వాళ్ళంతా వెడతారు. అందరీ అటెండెన్సు రిజిష్టరూ వాడి దగ్గరుంటుంది.

యవ్వనం జారుకుంటున్నపుడు అంటే వెళ్ళిపోతున్నపుడు ఎలా వుంటుందండీ అని మా మేనత్త బావగారి మూడో మరదలి ఆడబడుచు అడిగింది. ముసలమ్మలు దాన్ని 'కొంటెలంజ' అనేవారు. 'వొసే బుల్లిలంజా-యవ్వనం వెళిపోతున్నపుడు నీ ముఖం మీంచి బాతుకాళ్లతో ముద్రలు పడేలా నడిచివెళ్తుంది' యవ్వనం వెళ్ళాక పండు జుర్రేశాక విసిరేసిన మావిడి టెంకలానూ, అరిటిపండు తిన్నాక విసిరేసిన తోలులానూ, అయిస్క్రీమ్ తిన్నాక పారేసిన కప్పులానూ వుంటుంది జీవితం అన్నారు కొందరు.

మా మూడోవదిన అంటుందీ - 'పొయ్యి మీద గిన్నెలో బియ్యం వేసి కింద మంట పెట్టడం మర్చిపోతూ వుంటాను. లేదా బాణలిలో నూనెపోసి అది మరిగి మరిగీ పొగై వంటిల్లంతా ధూమ్‌ధామ్ అంటూంటే 'అయ్యో రామా' అని పరిగెత్తుకు వెళ్లి ఆర్పేసి నామతి మరుపుకై నన్ను నేనే తిట్టుకుంటూ వుంటాను. పెరట్లో పొయ్యిరాజేసి, గిన్నె ఎక్కించి-వీధిలో బ్యాండ్

మేళం వస్తే చూడ్డానికెళ్ళి వంటింట్లో పొయ్యి మీద గిన్నె గురించి మర్చిపోతూ వుంటాను. దీనికేమంటారు' అని.

మా వదినగారి మొగుడు 'చూడు అమ్మీ–యవ్వనం వెళ్ళిపోతూ నీకు మతిమరుపు లాటి చిన్న చిన్న అమర్యాదల్ని అంటగట్టి వెళ్ళి పోతోంది' అంటే ఆవిడ ఖస్సుమందిట –

'చిన్నప్పుడు పరికిణీలు వల్లెవాటుల్లోంచి పవిటల్లోకొచ్చినపుడు యిలాగే చిల్లరమల్లర పనులన్నీ మర్చిపోవడమో పరధ్యాసవల్ల పాడవడమో జరుగుతూండేది కదా దానికేమంటారు జానకీ వల్లభా' అందిట.

అప్పుడాయన నవ్వి 'యవ్వనం వచ్చినపుడూ వెళ్ళిపోయినపుడూ కూడా ఒకేరకం వికారాల్ని తెస్తుంది సుమా జానకీ' అని నవ్వారట.

ఆవిడ తెల్లబోయి బుగ్గన చేయి ఆనించుకుని నిలబడిపోయింది. సో వాట్!

# తెలుగుగోల

రైళ్ళలో కాని బస్సులలో కాని ప్రయాణం చేస్తున్నపుడు మనకి ఒక రకమైన మాటలు వద్దన్నా వినిపిస్తూ వుంటాయి. ఏ రైల్వే ప్లాట్‌ఫారం మీదైనా సరే – అర్టిపళ్ళను అరిటీపళ్ళనీ, చక్రకేళీలనీ పిలవకుండా 'కేలా' 'కేలా' 'కేలా' అని అరుస్తూ వుంటాడు అరిటిపళ్ళమ్మేవాడు. అరిటిపండుని అరిటిపండని పిలవడానికి సిగ్గుపడే జాతి మనది. శుభ్రంగా త్రిమూర్తుల్లా కిళ్ళీ, బీడీ, సిగరెట్ అని వుండగా 'పాన్ బీడా' 'పాన్‌బీడా' 'పాన్‌బీడా' అని అరుస్తాడు. అన్నిటి కంటె విచిత్రం ఏవిటంటే – శుభ్రమైన మామిడి తాండ్రని పట్టుకుని – తాండ్ర – తాండ్ర – తాండ్ర అని తాండ్ర పాపారాయుళ్ళా గర్వంగా అరవక ఆంగ్లో ఇండియన్‌లా 'మేంగో జెల్లీ – మేంగో జెల్లీ' అని అరుస్తాడు వాల్తేరు – విజయవాడ లైన్లో యించుమించు తుని – సామర్లకోటల వద్ద. అసలు మామిడి తాండ్ర పోసేదే గోదావరి జిల్లాల్లో – అక్కడ రైల్లో మాత్రం మామిడి తాండ్ర అంటే నామోషి వస్తుంది కాబోలు! 'మేంగో జెల్లీ' అన్నవాడ్ని పిలిచి పూచి పుచ్చుకు ఓ జెల్ల కొట్టాలి దిమ్మతిరిగేలా.

రైళ్ళలో 'పాలు–పాలు' అని నోరారా పిలవకుండా 'దూద్–దూద్' అని అంటాడు పాలమ్మే కుర్రాడు లేదా మిల్క్.

జీడిపప్పు అమ్మేవాడు జీడిపప్పు అని కేకెయ్యాలి. కాని, వాడు 'కాజా–కాజా' అంటాడు జీడిపప్పు అంటే స్టేటస్ భంగం అయిపోతున్నట్లు ఫీలయి.

ఇక భోజనం టిక్కెట్లమ్మేవాడు – చర్మంలాటి ఉదా బూడిదరంగు కోటు ధరించి – ఆ కోటుని వాడ్ని చూస్తే అన్నం సయించదు, వాంతి వెళ్ళిపోతుంది – వాడిక్కూడా తెలుగు భాష